# పంచుకోలేని ప్రేమలు

(కథానిక)

భవంతి చివరి అంతస్థులో పరుపు మీద కూచొని మిహిర్ వీణ వాయిస్తున్నాడు. తొలికోడి కూయకముందే లేచి వీణ తీశాడు. మొదటిపాట పూర్తయేసరికి రావిచెట్లమీది కాకులు గూడుల్లోంచి విలాసంగా విరుచుకొంటూ లేచాయి. రెండోపాట పూర్తయేసరికి రెండునీలాలు కలుసుకొనే అనంత దిఙ్మండలం అరుణ కిరణాలతో ఎర్రబారింది. మిహిర్ పక్కకి చూశాడు. పరుపు మీద పడుకొన్న శశి యింకా కళ్లు తెరవనేలేదు. నవ్వుకొంటూ మూడో పాట మొదలు పెట్టాడు.

శశి కళ్ళు విప్పి మిహిర్ కేసి నవ్వుకొంటూ చూశాడు. మిహిర్ దృష్టి గూడ శశి దృష్టిని కలుసుకొందిగాని, మిహిర్ మాత్రం పాట నాపలేదు. శశి మెల్లగా తన పక్కమీదినుంచి లేచి మిహిర్ పక్కకి చేరుకొన్నాడు. అతని కంఠంనించి వెలువడుతున్న శ్రావ్య సంగీతంలోకి దీక్షగా చూస్తూ మంత్రముగ్ధుడయిపోయాడు. మిహిర్ పాట అయిపోగానే నవ్వుతూ శశికేసి చూశాడు.

"ఇవాళ గూడ మీరే గెలిచారు" అన్నాడు శశి వీణ చివరి మెట్లమీద చిన్నగా కొడుతూ.

"ఇక నువ్వు లాభం లేదు. నువ్వెప్పుడూ నన్ను గెలవలేవు" అంటూ శశి పాలబుగ్గలమీద చిటికవేసి, అతన్ని దగ్గరగా తీసుకొంటూ, "శశీ! నీకెన్నిసార్లు చెప్పాను నన్ను మీరు అని పిలవద్దని. 'అన్నా' అనలేవూ?" అన్నాడు.

శశి చిరునవ్వుతో మిహిర్ కేసి చూసి, తర్వాత దృష్టిని వీణమీదికి తిప్పుకొన్నాడు.

ఇప్పుడు శశి పూర్తిగా ఈ భవంతిలో కలిసిపోయాడు. అలాంటి మార్పు శశిలో తీసుకరావడానికే మిహిర్ మూడేళ్ళు కష్టపడ్డాడు. ప్రొద్దుట రాగాలాపనతో మేల్కొల్పు, తర్వాత వీణ నేర్పించడం, అది అయిన తర్వాత కింద తోటలోవున్న టేంక్‌లో గంటల తరబడి ఈత కొట్టడం. ఇక భోజనం పడకా అంతా ఒక్క దగ్గరే కావటం మూలాన శశి చాలావరకు మిహిర్‌తో కలిసి పోయాడు.

మూడేళ్లక్రితం మిహిర్ స్నేహితులతో కలసి, ఎప్పుడో పల్లవులనాటి ఒక దేవాలయం ఆ కుగ్రామంలో వుందంటే, ఎంతో ప్రయాసతో ఆ రాత్రంతా వెన్నెల్లో డొంకలనించి, పొదలనించి నడిచి నడిచి చివరకా మారుమూల గ్రామం తెల్లారేసరికల్లా జేరుకొన్నారు. ఆ గ్రామీణులు జన్మలో ఇస్త్రీ చేసిన బట్టల్నే చూడనట్టున్నారు. వీళ్ళా గ్రామపొలిమేర యింకా తొక్కారో లేదో, చిన్నా, పెద్దా, స్త్రీ, పురుషులనే భేదంలేకండా అంతా వాళ్ళని చుట్టుముట్టి, ఏవో వింత జంతువులని చూస్తున్నట్టు చూడ మొదలు పెట్టారు.

ఎలాగయితేనేం, ఆ పల్లీయుల వింత చూపుల మధ్యనించి, యుద్ధంనించి తిరిగొచ్చిన వీరులకి నివాళి పట్టుకొని స్వాగతమిస్తున్నట్టు అరుగులమీద నిలబడి, వాళ్ళకేసే తేరపారి చూస్తున్న వనితల తీక్షణ దృష్టులనించి తప్పించుకొని చివరికా గర్భగుడిలోకి చేరుకొన్నారు.

లోపల ఏవో శిల్పాలు వున్నా, ముక్కు చెవులూ విరిగి అవి వికృతంగా అగుపిస్తున్నాయి. దేవాలయం బయట గోడల్లోనే స్త్రీ మూర్తుల విలాసత్వం వొయ్యారంగా వొంకర్లు తిరుగుతూ వాళ్ళనందర్నీ ముగ్ధులను చేసింది. మిహిర్ లోపలికి వెళ్ళకండా బయటనే నిలబడి అప్పటి శిల్పి హస్తవిన్యాసాల్ని, నైపుణ్యాన్ని లోలోన మెచ్చుకొంటూ ఆ అప్సరలకేసి ముగ్ధదృష్టితో చూస్తున్నాడు. పిల్లలు చాలామంది స్నేహితులతో లోపలికి వెళ్ళిపోయారు. కొందరు మిహిర్‌తో వుండి అతన్ని వింతగా చూస్తున్నారు.

యన్. ఆర్. నంది

"ఇదేమిటండి?" అని ఎవరో పిల్లాడు మిహిర్ మెళ్ళోని కెమెరాని వేలుతో కొడుతూ అడిగాడు.

మిహిర్ ప్రశ్నించిన కుర్రాడికేసి చూశాడు. మిహిర్ దృష్టి అలానే స్తంభించి పోయింది. ఆ పిల్లాడు ఎంత అందంగా వున్నాడు! ఎర్రటి పలచని రాగిరెంట్రుకలతో, చిన్న గోచీతో వున్నాడా పిల్లాడు. ముఖంలో ఏదో తీక్షణతవుంది. ఆ పిల్లాడిని చూడగానే మిహిర్ ఎందుకో వాణ్ణి ఎత్తుకొని ముద్దుపెట్టుకోవా లన్నంత ముచ్చటపడ్డాడు.

కాని అలా చేయకుండా వాణ్ణి చేత్తో దగ్గరకు తీసుకొని "దీంతో ఫొటోలు తీస్తారు' నీ ఫొటో కావాలా?" అన్నాడు.

మిహిర్ అలా మెల్లగా అన్నందువల్ల లాగుంది, ఆ కుర్రాడు దగ్గరగా వచ్చి కెమెరాని యిటూ అటూ తిప్పుతున్నాడు. ఫొటో అంటే అర్థం కానట్టుంది.

మిహిర్ నవ్వుతూ ఫొటో అంటే ఏమిటో అర్థం చెప్పి వాణ్ణి సరిగా నిలబెట్టి ఒక ఫొటో తీశాడు. తర్వాత కెమెరాని మూసి వాడి దగ్గరికొచ్చి పేరడిగాడు. ఆ పిల్లాడు యింకా కెమెరా కేసే అనుమానంగా చూస్తూ "పల్లప్పడండి" అన్నాడు.

వాడి ఒక్కడి ఫొటో తీసి మిగతావాళ్ళ ఫొటోలు తీయనందుకు పిల్లలందరూ "మాకు బొమ్మ దింపాలి, మాకూ బొమ్మ దింపాలి"అని మారాంపెట్టారు. వాళ్ళని స్థిమితపరిచే సరికి మిహిర్ కి ముచ్చెమటలూ పోశాయి. వాళ్ళు నిశ్శబ్దమైన తర్వాత మిహిర్ ఆ పిల్లాడి యిల్లు ఎక్కడుందో తెలుసుకొన్నాడు. కాని వాడు తలిదండ్రులు లేని అనాథ అనీ, ఒక రైతు యింట్లో పాలేరుపని చేస్తున్నాడనీ వినగానే మిహిర్ గుండెలు ఎందుకో తీవ్రంగా కొట్టుకొన్నాయి. అంత చిన్న వయసులో పాలేరు పని! పట్నవాసపు ధనవంతుల పిల్లాడయితే? మిహిర్ కి చాల జాలివేసింది. అంతలో లోపలి నించి స్నేహితులు బయటికి వచ్చారు.

"సుదర్శన్! చూడు ఈ పిల్లాడెంత అందంగా వున్నాడో! కాని తలిదండ్రులు లేరట! ఇంత చిన్న వయస్సులో పాలేరు పని చేస్తున్నాడట!" అని వాళ్ళతో ఇంగ్లీషులో చెప్పాడు. వాళ్ళంతా ఫక్కున ఒక్కసారిగా నవ్వారు.

"అంత ప్రేమ కలిగితే పెంచుకో" అన్నాడు సుదర్శన్.

అవును, మిహిర్ గూడ అలానే అనుకొన్నాడు. కాని ఆ యజమానో? మిహిర్ ఆ కుర్రాడి కేసి తిరిగి "నువ్వు నాతో పట్నం వచ్చేస్తావా?" అన్నాడు.

"ఎందుకండీ?"

"నిన్ను చదివిస్తాను, మంచి బట్టలు కుట్టిస్తాను, మిఠాయీలిస్తాను, కార్లెక్కిస్తాను, నిన్ను పెంచుకొంటాను."

"ఊహుఁ. నే రాను" అంటూ రెండడుగు లేశాడు.

మిహిర్ కి ఏమీ పాలుపోలేదు. ఆ పిల్లాడే అయిష్టంగా వుంటే తను తీసుకువెళ్ళలేడనుకొన్నాడు. ఒకవేళ తీసుకువెళ్ళినా వాడి మనస్సంతా పల్లెమీదే వుంటుంది. అయినా ప్రయత్నించాలని పట్నంలో ట్రాముల గురించి, కార్ల గురించి, సైకిల్స్ గురించి, సినిమాల గురించి, విమానాల గురించి ఎన్నెన్నో చెప్పాడు. కాని వాడు లొంగినట్టేమీ కనిపించలేదు. ఆ గ్రామాన్ని వొదిలేస్తే కొతికొమ్మంచి ఆట వుండదేమోననీ, సరదాగా చెరువుల్లో ఈత కొట్టే అదృష్టం వుండదేమోననీ అనుకొన్నట్టున్నాడు.

సరే, యింకేం చెయ్యగలడు? వెనక్కి తిరిగి దేవాలయాన్ని పూర్తిగా మూసి, మళ్ళా వెనక్కి ప్రయాణం కట్టారు అందర్నూ. గ్రామంలోకి వచ్చేసరికల్లా వాడి చిరునవ్వులు, ముద్దుబుగ్గలు జ్ఞాపకానికి వచ్చినై. ఇక ఆ గ్రామాన్ని వొదిలేస్తే తిరిగి మరిక అక్కడికి రారు. అందువల్ల వాడి ముఖంగూడ మరిచిపోవాలి!

ఏమయినా సరే ఆ పిల్లాడిని తీసుకవెళ్ళిపోవాలి! వెళ్ళిపోవాలి! గభుక్కున వెనక్కి తిరిగి పల్లప్పడి యజమాని దగ్గరకివెళ్ళి, 'వాణ్ణి నాకు యిచ్చేయండి' అని అడిగాడు. మొదట్లో అతను నిరాకరించాడు. తర్వాత డబ్బు ఆశ చూపించగానే సరే అన్నాడు. తను కోరిన పిల్లాడు తనవాడయిపోయాడు. వాడు తన

స్నేహితులని వొదిలిపెట్టి రాలేకపోయాడు. ఏడ్చాడు. తల బాదుకొన్నాడు. అయినా మిహిర్ ఎన్నో ప్రయత్నాలుచేసి వాణ్ణి ఒప్పించి పట్నానికి తీసుకవచ్చేశాడు.

మిహిర్ పెద్ద భవంతిని చూడగానే వాడు చాల ముచ్చటపడ్డాడు. మూడంతస్థుల మేడ. ఆడుకోడానికి తోటలో ఎన్నో చెట్లు. ఈతకి టేంక్. ఇక కావలిసిందేమిటి? కాని యిన్ని వున్నా అప్పుడప్పుడు వాడి మనసు బెదురుతూనే వుండేది. మిహిర్ అది కనిపెట్టి పాట పాడేవాడు. ఆ పాట వినగానే వాడు పరుగు పరుగున మిహిర్ పక్కకి చేరుకొనేవాడు. వాడి పేరు శశిగా మార్చేశాడు. ఒక మంచి మాస్టర్‌ని యింటికి రప్పించి తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు నేర్పిస్తున్నాడు. వాడు గూడా మాస్టరు చెప్పింది యిట్టే గ్రహించి అవగాహన చేసుకుంటున్నాడు.

ఇక మిహిర్ పని యిరవైనాలుగు గంటలూ శశితో బాతాఖానీ కొట్టడమే. కావలసినంత డబ్బుంది గాబట్టి మిహిర్ ఉద్యోగం చేయకపోయినా ఫర్వాలేదు. మిహిర్ తనకి వచ్చిన వీణ, వయొలిన్, పియానోలమీద పాటలు పాడటం నేర్పించాడు. వెన్నెల రాత్రులు డాబామీద కూచొని తను వీణమీద పాటలు పాడుతూంటే శశి మెల్లగా ఆ రాగంతో లయ కలిపేవాడు. చాలా శ్రావ్యమైన కంఠం వాడిది. పాపం తలిదండ్రులే లేకపోయారు. అని అనుకొనేవాడు మిహిర్.

"మీ అమ్మా, నాన్నా నీకు జ్ఞాపకమున్నారా, శశీ?" అని అడిగాడు ఒకనాడు.

"లేదు" అని సమాధానం చెప్పాడు.

"అయితే నన్ను ఏమని పిలుస్తావు?"

"ఏమని పిలవమంటారు?"

"అన్నయ్యా అను. నాన్నగారినీ, అమ్మనీ 'నాన్నగారూ' 'అమ్మా' అని పిలుస్తూండు" అన్నాడు.

శశి గూడా అప్పటినుంచి అలానే పిలచేవాడు. మిహిర్ నాన్నగారు గూడా శశిని ఎంతో ఆదరంగా చూసేవారు.

శశికి, మిహిర్‌కి గల విచిత్ర స్నేహాన్ని గురించిఆశ్చర్యంగా చెప్పేదిఅమ్మనాన్నగారితో.

"ఆ వయసులో అంతే, వివాహం చేస్తే అది భార్యమీదికి మళ్ళుతుంది" అని సమాధానం చెప్పేవారు ఆయన.

ఆవ్యాఖ్యానాన్నే సువర్ణన్ మరోలా అనేవాడు: "ఆర్టిస్టు జీవితంలో ప్రేమకి ఉన్నత స్థానముంది. వాడు బ్రహ్మచారి గాబట్టి శశిని అంతగా ప్రేమించగలుగుతున్నాడు. కాని వాడికి ఓ భార్యంటూ వచ్చిందా, ఇక శశిని వాడు మునుపటిలా ప్రేమించలేడు" అని.

మిహిర్ ఆ మాటలు విని నవ్వుకొనేవాడు. తనకి వివాహమయినా అవకపోయినా, తనలో శశికి ఉన్నతస్థానమే వుంది. శశి చిరునవ్వులకీ, చిన్నపలుకులకే తను పుట్టాడేమో అని అనుకొనేవాడు. సృష్టిలో ఆ తెగని మధురాలింగన వుండబట్టే ప్రాణుల హృదయాలు ప్రేమపూరితాలేమో?

ఇక ప్రపంచంలో శశి, మిహిర్ ఒక్కటైపోయారు. శశి ఒక్క నిముషం అగుపించకపోతే మిహిర్‌కి పిచ్చెత్తినట్టుండేది. చదువుకోసం శశి మాస్టరు పక్కనవుంటే, మిహిర్ గూడా శశిపక్కనే కూచొనేవాడు. చదువు అయిపోగానే యిద్దరూ వెళ్ళిపోయేవారు. సాయంకాలం కారుమీద సముద్రపు టొడ్డున తెల్ల యిసుకలో షికారు. శశి, తనే ప్రాణులన్నట్టు ఒకరి సమక్షంలో మరొకరు పరవశమయిపోయేవారు. ఎనిమిదేళ్ళ శశికీ, ఇరవై ఐదేళ్ళ మిహిర్‌కీ గల స్నేహం ఎలాంటిదో భావాలని తిప్పే మనసుకే తెలియాలి.

రాత్రులు యిద్దరూ ఒకదగ్గరే పడుకొంటారు. తెల్లవారి లేవడంలో ఎవరు ముందు లేచేది పందాలు వేసుకొంటారు. ఎప్పుడూ మిహిరే ముందు లేచి పాట పాడుతాడు. శశి ఎప్పుడూ ఓడిపోతూనే వుంటాడు. ఇవాళ గూడా అలానే ఓడిపోయాడు. తర్వాత యిద్దరూ కలసి కిందికి దిగిపోయారు.

మధ్యాహ్నం నాన్నగారు మిహిర్‌ని దగ్గరకి పిలచి, "ఈవాళ మనం రాజమండ్రి వెళ్లాలి" అన్నారు.

"ఎందుకండీ?" అన్నాడు అర్థంగాక.

"చంద్రగారు రమ్మని రాశారు. శ్రావణి బి.ఏ. పాసయిందట.

మిగతాది ఆయన చెప్పకుండానే మిహిర్ వూహించేశాడు. గబగబా శశిదగ్గరకు పరుగు పరుగున వెళ్ళాడు. శశి ఏదో చిత్రాన్ని వేసుకొంటూ, శబ్దం విని తల పైకెత్తి చూశాడు.

"శశీ! ఈవాళ మనం రాజమండ్రి వెడతాం. అక్కణ్ణించి నీకు ఒక వొదినగారిని తెస్తాం" అన్నాడు, పట్టుకొని ముద్దులాడుతూ.

"వొదిన ఎవరు?" అన్నాడు శశి అర్థం గాక.

"వొదినోయ్. నేను పెళ్ళిచేసుకొంటాను."

పెళ్లంటే అర్థమయినట్టుంది, నవ్వాడు.

ఆవాళే రాజమండ్రి వెళ్ళారు. కార్తీకంలో పెళ్లి గూడా అయిపోయింది.

శ్రావణి శశి కంటే గూడా బాగా పాడుతుంది. సన్నని గొంతుక. శశి ముఖంలో అదో రకం ఆకర్షణ. శ్రావణి ముఖంలో అదో విధమయిన అందం. ఆమె కళ్లని చూస్తే చాలు నరాల్లో విద్యుత్తు ప్రసరిస్తుంది. మిహిర్ వీణ వాయించేటప్పుడుశశిపాటపాడితే అదోవిధంగా వుండేది. ఇప్పుడు శ్రావణి ఒళ్ళో తల పెట్టుకొని తను పాడితే మరో విధంగా వుంటుంది.

వెన్నెల రాత్రులు. ఇప్పుడు శశి మేడ మీదికి రావటంలేదు. వొదిన వచ్చిందనగానే శశి ఎంతో పొంగిపోయాడు. అన్నయ్య ఇంకా ఆనందంగా తన్ని కొర్లల్లా తిప్పుతాడని ఆశించాడు. కాని అన్నయ్య యింతకముందులా మాటన్నా ఆడటంలేదు. బొమ్మలు వేయడం లేదు.

ఒకరోజు మిహిర్ ఏదో పనిమీద బయటకు వెళ్ళాడు. శశి వొదిన గదిలోకి మెల్లగా వచ్చాడు. వొదిన పరుపుమీద పడుకొని ఏదో పుస్తకం చదువుకుంటోంది.

"వొదినా" అని పిలిచాడు.

శ్రావణ తలెత్తి శశికేసి చూసింది. "రా శశీ" అని ఆహ్వానించింది.

ఆహ్వానించడమే తడవుగా శశి ఒదిన ఒళ్లో వాలిపోయాడు.

"వొదినా వీణ వాయించవూ, నేను పాట పాడతాను."

"పాడగలవా? సరే" అని శ్రావణి వీణ తెచ్చింది.

"నాకు అన్నయ్య పాటలు నేర్పించడం మానేశాడు వొదినా" తలొంచుకొని మెల్లగా అన్నాడు.

"ఏమిా?"

"ఏమో! చిత్రాలు వేయటం గూడా మానేశాడు."

శ్రావణి ఒక తంత్రువుని లాగింది. బిగువు లేని కారణాన అంది బొంగురుగా వినిపించింది. శ్రావణి చిరునవ్వు నవ్వుకొంటూ దాన్ని బిగించి సరిచేసింది.

"నేను నేర్పించమంటానుగాని, ఒక పాట పాడు" అంది శ్రావణి మెట్లలో వేళ్లని కదుపుతూ.

"ఏ పాట పాడను?"

"అన్నయ్య చెప్పిన పాటల్లో ఏదో ఒకటి పాడు."

"అన్నయ్య చెప్పి చాలా కాలమయింది. అవన్నీ మరచిపోయాను.నువ్వోపాట నేర్పించు"

"నాకూ మీ అన్నయ్య చెప్పిన పాటలే వచ్చు."

"సరే అదే నేర్పించు."

వీణలో సన్నని స్వరం సుళ్లు తిరిగింది. శ్రావణి కేసరాల్లాంటి వేళ్లు తంత్రువుల మీద నృత్యం చేస్తూంటే విశ్వగ్రహీతే శశి లేత హృదయంలో తల వూపుతున్నాయి.

ఇంతలో మిహిర్ వచ్చాడు. శ్రావణి పాట దూరంనించే విని పరుగుపరుగున వచ్చాడు. క్షీర సాగరంలో, పద్మరేఖల్లో, కైలాసంగా కూచొని విశ్వాన్ని లాలించే గొంతుకతో పాడే శారదని జ్ఞప్తికి తెచ్చింది శ్రావణి. ఆ పక్కనే తన్మయంలో వూగిపోతున్న శశిని చూడగానే మిహిర్ హృదయం గంతులేసింది. ఒక్కసారిగా 'శశీ' అని వాణ్ణి గట్టిగా కౌగిలించుకొన్నాడు.

"మీరు శశికి పాటలు నేర్పించడం లేదట, ఏం?" అంది శ్రావణి వీణ వొదిలి.

ఈ ప్రశ్నకి సమాధానం మిహిర్‌లో లేదు. అందుకే తేలికగా నవ్వి: "నువ్వు నన్ను

పురిలో చిక్కించుకొంటే బయటికెలా తప్పించు కోగలను?"

"బాగుంది చుట్టూ తిప్పి నామీదికే ఈ అపవాదు?"

"అవును నువ్వొచ్చిందగ్గర్నుంచే శశికి పాటలు నేర్పించడం లేదు" అన్నాడు మిహిర్ నవ్వుతూ.

"అవును వొదినా! నువ్వు వచ్చిందగ్గర్నుంచే అన్నయ్య పాటలు పాడటం మానేశాడు" అన్నాడు శశి.

"సరిసరి, అన్నదమ్ములిద్దరూ ఒక్కటై పోయారు. మీరే వుండండి అయితే. నే వెళ్ళి పోతాను" అంటూ పరుపుమీదినుంచి కిందికి దిగింది శ్రావణి.

శశి నవ్వుతూ వొదిన నడుముని చుట్టేశాడు. "అయినా నేను నిన్ను వెళ్ళనివ్వను" అన్నాడు.

"ఇప్పుడేనా అన్నావ్: మామూలానే మీ అన్నయ్య పాటలు నేర్పించడం లేదని. నేను వెళ్ళిపోతే మీ అన్నయ్య బాగా పాటలు నేర్పిస్తాడుగా."

"ఊహుఁ నువ్వెళ్ళకూడదు వొదినా" అన్నాడు శశిచిరునవ్వుతో బతిమాలుతున్నట్టు.

"మీ అన్నదమ్ములిద్దరూ ఒకలాంటి దుష్టులే. నిలబడితే కలబడతారు. కలబడితే ఓడిపోతారు" అని భర్తనంటూ శశిని ముద్దులాడింది.

వొదిన చల్లని చెయ్యి పాల బుగ్గలమీద పడగానే శశి పరవశుడైపోయాడు.

ఆ వాళ సాయంకాలం మిహిర్ బయటికి వెళ్ళకండా శ్రావణితో డాబామీద తిరుగుతున్నాడు. శశి మామూలు ప్రకారం సిల్కు బట్టలు వేసుకొని, అతన్ని పిలవడానికి పైకి వస్తున్నాడు.

"ఈవాళ బీచికి ఎందుకు రానన్నారు ?" అంది శ్రావణి.

"నువ్వుండగా అక్కడికి వేరే వెళ్ళడం ఎందుకు శ్రావణీ?"

అంతలో శశి వచ్చి "అన్నాయ్ బీచికి రావూ ? ఐదయిపోయింది". అన్నాడు.

మిహిర్ తలెత్తి శశికేసి చూశాడు. "శశీ ఈరోజు నువ్వొక్కడివి కారుమీద వెళ్ళు. నేను రాలేను" అన్నాడు.

"పోనీ వొదినా, నువ్వు... ?"

"నేను వస్తాను. ఉండు."

"వొద్దు శ్రావణి. శశిని ఒక్కడినే ఈ రోజుకి వెళ్ళిపోనియ్" అంటూ శశిని వెళ్ళిపొమ్మన్నాడు.

మిహిర్ యిలా అనడంతో శశి తల వొంచుకొని మెల్లగా వచ్చిన దారినే వెళ్ళిపోయాడు. శ్రావణి హృదయం చాలా బాధపడింది.

మిహిర్ లేనిది శశి ఒంటరిగా ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళలేదు. ఇప్పుడు అన్న అలా అనగానే శశి లోలోనే ఎంతో విచారిస్తూ కిందికి దిగిపోయి తనగదిలో పడుకొన్నాడు.

"శశీ! ఈవాళ బీచికి వెళ్ళలేదేం బాబూ?" అని నాన్నగారు అడిగారు.

"బొమ్మలు వేయడానికని ఉండిపోయాను నాన్నగారూ" అని అబద్ధమాడాడు-శశి.

మిహిర్ని ప్రాణంగా ప్రేమిస్తూ, తన పల్లెని. యజమానిని మరచిపోయిన శశి, కాలం జరుగుతున్నకొద్దీ మిహిర్ దూరమవుతుండడం వల్ల ఎంతో కృంగిపోతున్నాడు. ఆయనలా తననించి దూరమవుతుండడానికి కారణం శ్రావణి అని శశికి తెలుసు. కాని ఆమె మిహిర్ని బంధించడం లేదే!

శశి యిక్కడికి వచ్చిన మూడేళ్ళలోనూ ఎంతోమంది లక్షాధికారుల పిల్లలతో స్నేహితు



డయిపోయాడు. కాని తన్ని తీసుకవచ్చి పెంచిన మిహిర్ పాటలు నేర్పించడం మానేయగానే శశి ఎంతో లోలోన కుమిలిపోతున్నాడు.

కాలం శశి మూగవ్యథతో నే జరిగిపోతోంది మెల్లమెల్లగా. శ్రావణి మిహిర్ దాంపత్యానికి సాక్షిగా అవతరించిన కమల్ గూడ అప్పుడే రెండేళ్ల వాడయిపోయాడు.

ఆ చిన్న కొడుకుని చూసుకొని మిహిర్ ఎంతో పొంగిపోయేవాడు. అతను నవ్వుతూ కిలకిల్లాడేకొద్దీ శశి కృంగిపోతున్నాడు. కమల్ పక్కన మిహిర్ పడుకొని ముద్దులాడుతూంటే శశి లోలో నే బావురు మనేవాడు.

"శశీ! కమల్ ని తీసుకొనిరా. అందరం బీచికి వెడదాం" అనేవాడు మిహిర్. శశి తల వంచుకొని కమల్ ని తీసుకవచ్చేవాడు.

"శశి రోజు రోజుకీ అదోలా అయిపోతున్నాడు, డాక్టరుకి చూపించగూడదండీ" అంది శ్రావణి ఒకరోజున.

"అది కొత్తగా వస్తున్న యవ్వనం. ఆ వయస్సులో సిగ్గు ఎక్కువ పాలులో వుంటుంది. అందుకే శశి అలా బెదురుతున్నట్టు కనిపిస్తున్నాడు" అని సమాధానం చెప్పాడు.

కమల్ పుట్టిన దగ్గరనించి శ్రావణి గూడ అంతగా శశిని చేరదీసి పాటలు పాడటంలేదు. ఇది శశిని యింకా కృంగదీసింది. అన్న మారినా వదిన ప్రేమమయి అనుకొన్నాడు. కాని వదినగూడ అలా అయిపోవడం శశిని మరింత కృంగదీసింది.

వ్యథతో శశి కృశించిపోయాడు. మిహిర్ శశి గురించి వైద్యులని రప్పించాడు. కాని అసలు జబ్బు ఏమిటో ఎవరూ కనిపెట్టలేక పోయారు. మిహిర్ కేసి, శ్రావణికేసి శశిఎంతో జాలిగా చూస్తాడు. కాని ఆ మూగదృష్టి అంతరార్థాన్ని ఎవరూ తెలిసికోలేకపోయేవారు.

వారం రోజులు మంచంమీదే వున్నాడు.

మిహిర్ ఆవేళ చాల కంగారు పడ్డాడు. మరో డాక్టర్ని తీసుకరావడానికి కారుమీద వెళ్ళాడు. పెద్దహాల్లో శశి ఒక్కడే పట్టె మంచంమీద శాంతంగా నిద్రపోతున్నాడు. ద్వారం తెరని తొలిగించుకొని శ్రావణి శశి పక్కకి వచ్చికూచొంది.

"శశీ" మెల్లగా, లాలనగా పిలచింది.

శశి బరువుగా కళ్ళు విప్పాడు.

"ఎలావుంది బాబూ" అంది తల నిమురుతూ.

"బాగానే వుంది వదినా. అన్నయ్య లేదు కదూ? చివరికి అన్నయ్య పాట వినకండానే చచ్చిపోతానే..."

చటుక్కున శ్రావణి శశి నోరు మూసింది.

"అలా అనకు శశీ."

కాసేపు నిశ్శబ్దం.

"వదినా! ఒక్క పాట పాడవ్? నువ్వు పాడే పాటలన్నీ అన్నయ్య నాకు నేర్పించినవే. ఒక్క పాట పాడు వీణమీద."

శ్రావణి వీణ తీసింది. తీగలని మీటింది. మెల్లతో ఆ తీగల ప్రకంపనాలని తగ్గిస్తూ హెచ్చిస్తూ వనప్రియని జ్ఞప్తికి తెప్పిస్తోంది.

వదినపాట జోలపాటలా వుంది. ఫాలం మీది ముంగురులు కదులుతున్నాయి. మాత రిశ్వుడు మెల్లని లయని ఆ పాటతో మేళవించాడు.

శ్రావణి పాట అర్థం:

భూమాత, అనంతాకాశంలో వున్న తన పుత్రులని ప్రేమతో పిలుస్తోంది. కాని ఆమె పిల్లల్ని లాలించే విధానం చాలాకాలము మరచిపోయింది. తన సహజ ఆకర్షణతో వాటిని ముద్దుగా తన దగ్గరకి తీసుకోబోయింది. కాని అది మొరటుతనం. అందువల్ల తారలు గాలి రాపిడికి కాలి భగ్గుమని మసి ఐ, ఉల్కల్లా కిందికి పడిపోతున్నాయి.

ఈ పాట పూర్తయేసరికి సరిగా మిహిర్ డాక్టర్ని తీసుకొని వచ్చాడు. శ్రావణి లేచి నిలబడింది. డాక్టరు పట్టుపరుపుల్లోని శశిని పరీక్షించాడు. నాడి కోసం పరీక్షిస్తున్నాడు.

బయట మిహిరుడు లేక ఆకాశంలో శ్రావణి లేదు. ఆ నిశిలో శశి ఏ కళలో వున్నాడో! కాని తెగిపోతున్న తారలని మాత్రం భూమాత సజీవంగా ముద్దులాడ లేకపోతోంది!